

# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## – వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ డ్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ దీవ్పే డొయిచ్ ఖండే

## చివరి విడత: మలి సందడి (19)

*స్నేహానంద లహరి*

డాడ్ సంస్థ భూషణ్‌కి బెర్లిన్ సందర్శన యాత్ర ఏర్పాటు చేసింది. వెంటనే అతడు నాకుత్తరం వ్రాస్తూ, 'ప్రోగ్రాం చాలా టైటుగా ఉంది. ఐనా ఎలాగో అలా వీలు చేసుకుని ఓ పూట నిన్ను కలుస్తాను. నాకు నిన్ను చూడాలనుంది' అని తెలియబర్చాడు.

భూషణ్ నాకు బాగా తెలుసు.

ఎవరికైనా అవసరమైనప్పుడు సాయం చెయ్యడానికి అడక్కుండానే నడుం కడతాడు.

ఉత్తప్పుడు తన లోకం తనదన్నట్లు ఎవరితోనూ కలవడు.

అతడు బెర్లిన్ వస్తాడని తెలుసు కానీ, వచ్చి ఊరు చూసి వెళ్లిపోతాడనుకున్నాను.

దేశం దాటి వచ్చేక అనుబంధాలు ఏర్పడతాయేమో మరి.

ఊరు దాటి వచ్చేక నాకు మా ఊరివాళ్లు కనబడితే మహదానందమయ్యేది. ఉద్యోగంలో చేరేక భువనేశ్వరే మా ఊరయింది. మా ఆఫీసు కొలీగ్సు ఉమ్మడి కుటుంబంలో సభ్యుల్లా అనిపిస్తున్నారు.

అందుకేనేమో ఆ ఉత్తరం నాకు కలిగించిన సంతోషం అంతా ఇంతా కాదు.

మళ్లీ మళ్లీ చదువుకున్నాను.

ఉత్తరం చిన్నదే.

అందులోని ప్రతి వాక్యంలోనూ నిండిన ఆత్మీయత నా అంచనాకి అందడం లేదు

జీవితమొక అనుబంధాల వలయం!.

అన్న ప్రకారం ఓ రోజు సాయంత్రం వచ్చాడు భూషణ్.

అనుబంధం నాకే కాదు. భువనేశ్వర్లో ఒకే కాలనీవాళ్లం. పిల్లలు కూడా అతణ్ణి తొందరగానే గుర్తు పట్టారు.

ఆత్మీయులకోసం మొహం వాచి ఉన్నాడేమో, అతడు శ్రీమతిని హిందీలో పలకరించి కుశలప్రశ్నలు వేశాడు.

పిల్లల్ని చెంతకు పిలిచి దగ్గరగా తీసుకున్నాడు.

భూషణ్‌కి దక్షిణాది వంటకాలు అంతగా నచ్చవు.

మాకు ఉత్తరాది వంటలు అంతగా అలవాటు లేవు.

ఉభయతారకమని శ్రీమతి అతడికోసం పూరీ-కూర చేసింది.

అతడికి స్వీటెక్కువ ఇష్టమని మైదా హల్వా చేసింది.

ముందుగా టీ పెట్టిచ్చింది. చివర్లో మజ్జిగలో పంచదార కలిపిచ్చింది.

"మీరు మజ్జిగలో ఉప్పేసుకుంటారు కదూ, నాకోసం పంచదార వేశారా?" అన్నాడతడు.

"ఏదో - గుర్తున్నంతలో, మాకు వీలైనంతలో - చిన్ని ప్రయత్నం" అన్నాను.

అతడు మహదానందపడ్డాడు. "ఇది చిన్ని ప్రయత్నమా! జర్మనీకొచ్చేక ఇంత మంచి ఫుడ్ తినలేదు" అని శ్రీమతిని మెచ్చుకున్నాడు.

మిగతావన్నీ రొటీన్ విశేషాలు.

రొటీన్ కానిది కాసేపు జర్మనీ గురించి మామధ్య జరిగిన సంభాషణ!

“వచ్చేముందు ఈ దేశం గురించి ఎంతో గొప్పగా ఊహించాను. కానీ అంతా హంబగ్” అన్నాడతడు.

“ఎందుకని?” అన్నాను కుతూహలంగా.

“ఈ కాపిటలిస్టులు ఏంచేసినా ప్రచారంకోసం చేస్తారు. వీళ్లు దేశదేశాలకూ మిషనరీల్ని పంపి మానవసేవ చేస్తామంటారా, ఆ సేవనిండా ప్రచారం. అమాయకులైన పేదల్ని మతమార్పిడికి ప్రోత్సహించేలా ఉంటుందా ప్రచారం. మత ప్రచారం ఎందుకంటే సామాన్యులపై పట్టు బిగించడానికి మతమొక గొప్ప ఆయుధం” అన్నాడతడు.

“మతం గురించి నువ్వనది నిజమే కానీ, మనకి గ్యోతే ఇన్‌స్టిట్యూట్‌లో మతప్రచారం జరిగినట్లు లేదే!” అన్నాను ఉండబట్టలేక.

“అదే వీళ్ల తెలివి. పేదవాళ్లనీ, చదువురానివాళ్లనీ ఒకలా డీల్ చేస్తారు. మనలాంటివాళ్లని మరోలా డీల్ చేస్తారు. ఏదేమైనా అంతా డీలింగే” అన్నాడతడు.

పశ్చిమ దేశాలన్నీ ధనస్వామ్య వ్యవస్థకు ప్రతిబింబమట.

ధనస్వామ్యం దోపిడీకి మారుపేరుట.

ధనస్వామ్యంలో డబ్బు, అధికారం కొందరి చేతుల్లోకే వెళ్లిపోతుందట.

ఆ కొందరూ మిగతా ప్రపంచాన్ని శాసిస్తారంటూ, “ఎంతలా అంటే, మేధావులు కూడా దానికి దాసోహమంటారు. వారికిక మతమార్పిడి అవసరమే ఉండదు” అన్నాడతడు.

“ఎవరు ఎవరికి దాసోహమంటారో తెలియదు. కానీ దాసోహమన్నవారికి కూడా ఇక్కడున్నంత స్వేచ్ఛ మరే వ్యవస్థలోనూ లభించదు కదూ!” అనడిగాను.

“నువ్వు స్వేచ్ఛ అనుకుంటున్నది స్వేచ్ఛ కాదు. ధనమదం, అధికారమదం చేసే ప్రచారం – దాన్ని స్వేచ్ఛ అనుకునేలా చేస్తుంది. నాలుగు డబ్బులున్న సామాన్యులు ఉన్న కొంచెం డబ్బునీ విలాసాలకు తగలేసి, అదే స్వేచ్ఛ అనుకుంటారు. వాళ్లకి అధికారమదాన్ని ఎదిరించే స్వభావమే అలవడదు. దాంతో అధికారబలం ఉన్నవాళ్లకి ఎదురుండదు” అన్నాడతడు.

“కానీ మనిషి అన్నవాడెవరైనా కోరుకునేది ఇలాంటి స్వేచ్ఛనే కదా!” అన్నాను.

“విచ్చలవిడితనం స్వేచ్ఛ కాదు. పతనం. మన దేశంలో చూడు. అన్నింటా విలువలకి ప్రాధాన్యమిస్తారు. అందుకే అక్కడ ఒక పూట తింటే ఒక పూట పస్తులుండేవాళ్లు కూడా ఎంతో సంతోషంగా ఉంటారు” అన్నాడతడు.

పేదవాళ్ల సంతోషం గురించి కవులు, కళాకారులు, వేదాంతులు – చెప్పడమే కానీ – పేదరికం సంతోషాన్ని ఇస్తుందని మనస్ఫూర్తిగా అనగల పేదవాళ్లు నాకు తగల్లేదు.

ఆ మాటనకుండా, “ఐతే ఇక్కడివాళ్లెవరూ సంతోషంగా లేరంటావా?” అడిగాను.

“సంతోషంగా ఉన్న మనిషి సిగరెట్లు, తాగుడు, వ్యభిచారం వగైరాల గురించి ఆలోచించడు. ఆనందాన్ని సామాన్య జీవితంలోనే వెదుక్కుంటాడు. మనం దురలవాట్లనేవి ఇక్కడ గౌరవనీయమైన అలవాట్లుగా చెలామణీ ఐపోతున్నాయి. అంటే ఇక్కడి జనం దురలవాట్లలో సంతోషాన్ని వెదుక్కుంటున్నారు” అన్నాడతడు.

చిత్రమేమిటంటే భూషణ్‌కి సిగరెట్ల అలవాటుంది. మద్యం పుచ్చుకుందుకు అభ్యంతరం లేదు.

వాటిని దురలవాట్లుగా అతడు భావిస్తున్నాడనుకోను.

ఏకపక్షంగా మాట్లాడేవారు వాదించేటప్పుడు ఎక్కువ ఆలోచించరు.

అందుకే సందర్భానుసారంగా వాళ్ల అభిప్రాయాలు మారుతుంటాయి.

చాలామంది దురలవాట్లు అనే అలవాట్లు నాకు లేవు.

కానీ నేనెప్పుడూ ఫలానావి దురలవాట్లని వర్గీకరించలేదు.

స్వేచ్ఛ కారణంగా ఇక్కడివారు దురలవాట్లకు లోనయ్యారని అనుకుందామంటే, ఆ దురలవాట్లతోనే వారు – ఆర్థికంగా, వైజ్ఞానికంగా అద్భుతమైన ప్రగతిని సాధించారు.

ఆ దురలవాట్లని నిరసించే ఇతర దేశాలు అలాంటి ప్రగతిని ఎందుకు సాధించలేకపోయాయి?

ఈ సందేహానికి భూషణ్ ఇచ్చిన సమాధానం చిత్రంగా ఉంది.

ఇక్కడి పౌరుల్లో అంతటి సమర్థులు లేరుట.

ఇతర దేశాల మేధావుల్ని ఎత్తుకునొచ్చి వారి సామర్థ్యాన్ని ఉపయోగించుకుంటారుట.

''ఇదో దోపిడి వ్యవస్థ. అదంతే!'' అని తేల్చేశాడతడు.

''మరైతే దోపిడి లేని వ్యవస్థ ఎక్కడుంది?'' అడిగాను.

''ఆ విషయానికే వస్తున్నాను'' అన్నాడతడు, ''మనుషులందర్నీ సరిసమానులుగా చూడగల ఒకే ఒక్క వ్యవస్థ కమ్యూనిజం. అదంటే ఇక్కడివాళ్లకి మహా భయం. అందుకని కమ్యూనిజాన్ని వ్యతిరేకిస్తూ ప్రచారం చెయ్యడమే ఆశయంగా పెట్టుకున్నారు. ఇక్కడి కొచ్చినప్పట్నించి చూస్తున్నాను. గ్యోతే ఇన్స్టిట్యూట్ క్లాసుల్లో కానీ, నా రీసెర్చి కొలీగ్సుతో సంభాషణల్లో కానీ, కమ్యూనిజమంటే చెప్పలేనంత వ్యతిరేకత. వాళ్లు డబ్బు ఖర్చు పెట్టి మమ్మల్నందర్నీ బెర్లిన్ ఎందుకు తీసుకొస్తున్నారో తెలుసా – మేమంతా బెర్లిన్లో తూర్పు పశ్చిమ విభాగాలకి ఉన్న భేదం కళ్లారా చూడాలని. చూసి మేమూ కమ్యూనిజానికి వ్యతిరేకంగా ప్రచారకులం కావాలని!''

నేను వెంటనే, ''కళ్లారా చూశావుగా, నీకేమనిపించింది?'' అన్నాను.

''వాళ్ల ప్రచారం ఎంత అబద్ధపుదో గ్రహించాను. తూర్పు బెర్లిన్లో అలెగ్జాండర్ ప్లాట్జ్ చూసే ఉంటావ్. పశ్చిమ బెర్లిన్లో ఏ ఏరియా దానికి సాటి వస్తుందో చెప్పు'' అన్నాడతడు.

తూర్పు బెర్లిన్లో అలెగ్జాండర్ ప్లాట్జ్ గొప్పగా ఉన్న మాట నిజమే.

కానీ నాకైతే మొత్తం పశ్చిమ బెర్లినంతా అంత గొప్పగానూ అనిపించింది.

అలా చెబితే నొచ్చుకుంటాడని, ''మరక్కడ ఆ ప్రాంతం దాటి నాలుగంటే నాలుగడుగులు వేశామనుకో. అక్కడా ఆలెగ్జాండర్ ప్లాట్‌జ్‌లాగే ఉందా?'' అన్నాను.

భూషణ్ నవ్వాడు, ''అదే కమ్యూనిజం గొప్పతనం. కావాలంటే కాపిటలిస్టులకంటే వైభవంగా ఉండగలమని నిరూపించడానికి అలగ్జాండర్ ప్లాట్జ్. తమ పౌరులకి ఎలాగుండడం ఇష్టమో తెలియబర్చడానికి మిగతా ప్రాంతం. తూర్పు జర్మనీ ఆర్థిక పరిస్థితి, పశ్చిమ జర్మనీకంటే మెరుగ్గా ఉంది. వాళ్ల పౌరులు వైభవంకంటే కృషికే ప్రాధాన్యమివ్వడం అందుక్కారణం. ఆ పౌరులు ఇక్కడి పౌరులకంటే ఎన్నో రెట్లు ఎక్కువ ఆనందంగా ఉన్నారు. బెర్లిన్ గోడ కట్టేక పశ్చిమంనుంచి తూర్పుకే కానీ, అట్నించిటు పౌరులు పారిపోయిన సంఘటనలు లేవు. మనబోటివాళ్లని తప్పుదారి పట్టించడానికే, వీళ్లు స్వంత డబ్బుతో బెర్లిన్ యాత్రలు ఏర్పాటు చేస్తున్నారు. నేను ధనస్వామ్య ప్రచారానికి లోబడేవాణ్ణి కాదు. నాకంతా స్పష్టంగా అర్థమైంది'' అన్నాడు.

పౌరులు అట్నించిటు పారిపోవడంలో – నాకు తెలిసింది, అతడు చెప్పిందానికి పూర్తిగా భిన్నం.

నాకు తెలిసినవి కళ్లకి కనబడే వాస్తవాలు.

అతడు చెబుతున్నవి తన ఆలోచనలకు ప్రతిరూపాలు.

కొందరు కళ్లతో చూస్తారు. కొందరు మెదడుతో చూస్తారు.

సామ్యవాదం గొప్పదే కావచ్చు. కానీ దాన్ని నమ్మేవారు – జ్ఞానేంద్రియాల్ని మెదడునుంచి వేరు చెయ్యడం నాకు ఎప్పట్నించో స్వానుభవం.

సామ్యవాదం నాకిష్టమే. కానీ ధనస్వామ్యం పట్ల నాకు ద్వేషం లేదు.

అప్పట్లో రష్యాలో, ఇప్పటికీ చైనాలో అనుసరించబడే సామ్యవాద వ్యవస్థలో పౌరుడిగా ఉండాలని వ్యక్తిగా నేను కోరుకోను.

ధనస్వామ్య, సామ్యవాదాల సంయమనంగా ఉంటున్న భారత దేశ వ్యవస్థ నాకిష్టం.

ఇవన్నీ నేను భూషణ్‌కి చెప్పలేదు.

తనంతటివాడు తను. తన నమ్మకాలు తనవి. తన విశ్లేషణ తనది.

తనని మార్చాలన్న ఉద్దేశ్యమూ, అవసరమూ నాకు లేవు.

ఆపైన అతడిప్పుడు నా అతిథి.

''ఇక్కడ చాలా నెలలుగా ఉంటున్నా, ఒకే ఒక్కసారి తూర్పు బెర్లినుకి వెళ్లాను. నువ్వు చెప్పింది విన్నాక, మరోసారి వెళ్లి నీ దృష్టికోణంలో చూడాలనిపిస్తోంది'' అన్నాను.

భూషణ్ హేపీ. తర్వాత ఇద్దరం రీసెర్చి గురించి కాసేపు మాట్లాడుకున్నాం.

''డబ్బుంది కాబట్టి ఖరీదైన పరికరాలు అందుబాటులో ఉన్నాయి. అవి మనకుంటే మన దేశంలో ఇంతకంటే బాగా పని చెయ్యొచ్చు'' అన్నాడు.

పరికరాలుంటే సరిపోతుందా? వాటిని సరిగ్గా ఉపయోగించుకోనిచ్చే వ్యవస్థ కూడా మనకి లేదన్నది నాకు స్వానుభవం.

ఆ మాటనకుండా, ''ఖరీదైనవాటి సంగతటుంచు. జిరాక్సులాంటి కనీస సదుపాయాలే లేవు మనకి'' అన్నాను.

''జిరాక్సు లేకపోవడమేమిటి? అక్కడ మన లైబ్రరీలో ఉందిగా. నేను తరచుగా జిరాక్సులు తీసుకునేవాణ్ణి'' అన్నాడతడు.

మా లేబరేటరీలో జిరాక్సా? ఇక్కడికొచ్చేదాకా నేనసలా పేరే వినలేదు.

భూషణ్ మాటలు నాకు ఇంచుమించు షాక్.

''అయ్యో! జర్నల్సులో రీసెర్చి సమాచారాన్ని చూసి వ్రాసుకుందుకు ఎంతో కష్టపడేవాణ్ణి. నీకు తెలుసుగా – కనీసం రోజుకో గంటైనా నేను లైబ్రరీలో గడిపేవాణ్ణి. ఈ విషయం తెలిస్తే ఎంతో బాగుండేది. గంటలో నాలుగ్గంటల పనయ్యేది'' అన్నాను.

''ఎవరికి వారు తీసుకుందుకు వీలయ్యే యంత్రం కాదులే అది. దానికి కాపర్ సల్ఫేట్ మిశ్రమం తయారు చేసి వాడాలి. వాడ్డానికీ అదంత సింపుల్ కాదులే. కాపీలు తియ్యడానికి శిక్షణ పొందిన మనిషి ఉండాలి. కాపీలు కావాల్సినవాళ్లు ముందుగా చెప్పాలి. ఆపరేటరు కూడా పార్ట్ టైం కాబట్టి తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప ఆ పని చెయ్యడు. నాకా ఆపరేటరు తెలుసు కాబట్టి అప్పుడప్పుడు వాడుకున్నాను కానీ, అంతకంటే చేతివ్రాతో, టైపింగో బెటరనిపించింది'' అన్నాడు భూషణ్.

జిరాక్సు మనకీ ఉందంటే, ఇక్కడున్నట్లు సెకనుకో కాపీ వచ్చే యంత్రమనుకున్నాను. ఎవరికి వారు ఆపరేట్ చేసుకోగలది అనుకున్నాను.

మా అవసరాల విషయానికొస్తే ఇతడు చెప్పిన యంత్రం ఉన్నా లేనట్లే మరి!

ఆ విషయం తనకీ తెలుసన్నట్లు మాటల్లో సూచించాడు కూడా.

చిన్నప్పుడు చదివిన ఎద్దు–కప్ప కథ గుర్తుకొచ్చింది.

కప్ప తన పొట్టని ఎంత ఉబ్బించినా – ఎద్దు పరిమాణానికి చేరుకోగలదా?

అప్పుడు చాలా విషయాల్లో మనమా స్థితిలోనే ఉన్నామన్నది వాస్తవం.

వాస్తవాన్ని గ్రహిస్తేనే ప్రగతికి అవకాశముంటుంది.

లేకుంటే ‘ఎక్కడ వేసిన గొంగళీ అక్కడే ఉంటుంది.

ఏదేమైనా – భూషణ్ రాకతో నాకు రెండు విషయాలు స్పష్టమయ్యాయి.

ఒకటి – రోజూ చూసేవే ఐనా, మన పరిసరాల గురించి మనకి తెలియనివి చాలా ఉంటాయి.

రెండు – కళ్లకి స్పష్టంగా కనిపించే విశేషాలు కూడా ఒకొక్కరికి ఒకోలా అనిపించే అవకాశముంది.

భూషణ్ విద్యాధికుడు. అంకితభావమున్న సైంటిస్టు. మానవతావాది.

అతడి అభిప్రాయాలకి విలువ లేదనుకుంటే, నాఅభిప్రాయాల్లోనూ ఏదో లోపముండొచ్చు.

అతడి అభిప్రాయాల్లో నిజంగానే తప్పుంటే – మేధావులైనంత మాత్రాన మానవతావాదులు కూడా ఒప్పుగా ఆలోచించగలరనుకుందుకు లేదు.

ఇది భూషణ్ రాకతో నాలో కలిగిన మానసిక వికాసం.

ఇంద్రధనుస్సులో ఏడు రంగులు. అన్నీ కలిస్తే తెలుపు.

తెలుపు శాంతికీ, మంచితనానికీ చిహ్నం.

అంటే రంగు ఏదైనా కావచ్చు. ఆ రంగు మనకు నచ్చనిది కూడా కావచ్చు.

కానీ ప్రతి రంగూ మంచితనంలో ఒక భాగం.

బెర్లిన్లో మా ఇంటికి వచ్చిన మిత్రులందరూ తలో రంగూ.

అందరూ తెలుపులో భాగమే!

భూషణ్ భాష వేరైనా అతడు భువనేశ్వర్లో నా కొలీగ్ కాబట్టి మా పిల్లలకి కూడా సుపరిచితుడు.

బెర్లిన్లో మా ఇంటికొచ్చి మమ్మల్ని కలుసుకోవాలని మనసు పడ్డ దేవ్‌దార్ విషయం అలా కాదు.

అతడు నాకు మాత్రమే పరిచితుడు.

ఆ పరిచయం కూడా ఇక్కడికొచ్చేక గ్యోతే ఇన్‌స్టిట్యూట్‌లో జరిగింది.

అప్పుడది జర్మన్ భాష నేర్చుకుంటున్న సమయం.

మాలో మేం మాట్లాడుకుందుకు – మధ్యమధ్య హిందీని కలగలుపుతూ, ఇంగ్లీషు వాడుతున్న సమయం.

అప్పుడు ఇతర భారతీయ భాషల గురించి పట్టించుకోలేదు కానీ, ఇప్పుడు దేవ్‌దార్ మా ఇంటికొస్తున్నట్లు ఉత్తరం ద్వారా తెలియ బర్చగానే ముందుగా గుర్తుకొచ్చిన విషయం అతడు మహారాష్ట్రియన్ అని.

మనకి తెలియకుండానే భాష కూడా మన అనుబంధాల్ని శాసిస్తుందని అప్పుడు నాకు అర్థమైంది.

నాలుగు నెలలు గ్యోతే ఇన్‌స్టిట్యూట్‌లో కలిసిమెలిసి ఉండడంతో దేవ్‌దార్‌తో ఆత్మీయానుబంధం ఏర్పడింది. అదెంత బలమైనదంటే – బెర్లిన్ వస్తున్నప్పుడు మా కుటుంబంతో ఓ పూట గడపాలని అతడికి అనిపించింది.

అతడొస్తాననగానే, దగ్గరి బంధువు మా ఇంటికొస్తున్నాడన్న భావన నాకూ కలిగింది.

శ్రీమతి కూడా, ‘‘అతగాడు మనల్ని చూడాలని అనుకోవడమే ఒక విశేషం. చూడ్డానికి రావడం ఇంకా విశేషం. మనిషి సంఘజీవి అయ్యాడంటే తప్పనిసరై కాదు. అది మనిషి తన ఆనందంకోసం ఎంచుకున్న జీవనవిధానం. మీ మిత్రుడి రాక నాకూ చాలా సంతోషంగా ఉంది. ఎందుకంటే మీ ఇద్దరి సంభాషణలూ వింటూ – మీ గత అనుభవాల్లో నేనూ ప్రత్యక్షభాగస్వామిని కావచ్చు’’ అని ఉత్సాహపడింది.

కానీ సాంఘిక జీవనంలో భాష కూడా ప్రధానమే.

అసలు భాష పుట్టిందే మనిషిని మనిషినుంచి వేరు చెయ్యడానికని – బైబిల్లో కాబోలు ఓ కథ ఉంది.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments